క్లుప్తంగా

'తెలుగు తేజం' నాగేశ్వరయ్య



అవార్డు స్వీకరిస్తున్న నాగేశ్వరయ్య

కర్నూలు కల్చరల్: సాహిత్య రంగంలో విశేష సేవలు అందిస్తున్న కర్నూలు వాసి కోలుకొండ వీర నాగేశ్వరయ్య 'తెలుగు తేజం' పురస్కారం అందుకున్నారు. శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఆగస్టు 31న పల్నాడు జిల్లా నరసరావు పేటలో నిర్వహించిన తెలుగు వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి కార్యక్రమంలో ఆయనకు పురస్కారాన్ని అందజేశారు. కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీభూషణం, సభ్యులు పార్థసారథి తదితరులు పురస్కారాన్ని ప్రదానం చేశారు.

కార్మిక హక్కుల సాధనకు ఉద్యమించాలి

కర్నూలు(సెంట్రల్): కార్మికుల హక్కులు.. కార్మిక రాజ్యం కోసం ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం కార్మిక, కర్షక భవన్‌లో సీఐటీయూ న్యూసిటీ మూడో మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు గోపాల్ అరుణ పతాకాన్ని ఆవిష్కరించి ఇటీవల చనిపోయిన కార్మికుల కుటుంబాలకు సంతాపాన్ని తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్ రాధాకృష్ణ, ఎండీ అంజిబాబు, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.నిర్మల మాట్లాడుతూ.. కార్మికులను కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలన్నారు. 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించి 8 గంటల పని విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. కార్మిక హక్కుల కోసం ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం సీఐటీయూ న్యూసిటీ కమిటీని ఏకవగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి



ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో ఆటోల్లో ప్రయాణించే వారే కరవయ్యారని, దీంతో ఆటో డ్రైవర్లు ఇబ్బందులు పడాల్సి వస్తోందని, ఈ క్రమంలో లైసెన్స్ ఉన్న ప్రతి ఆటో డ్రైవర్‌కు నెలకు రూ.12 వేలు ఇవ్వాలని సీఐటీయూ ఓల్డ్ సిటీ సెక్రటరీ విజయ రామాంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆటో డ్రైవర్లు తమకు న్యాయం చేయాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. నాయకులు నాగస్వాములు, రామకృష్ణ, మహ్మద్ పాల్గొన్నారు.

స్వర్ణకారుడి దారుణ హత్య

కర్నూలు: స్థానిక పాతబస్తీలోని రాధాకృష్ణ టాకీస్ సమీపంలో మసీదు వద్ద బంగారు నగల తయారీదారుడు ఇబ్రార్ అహ్మద్ (45) దారుణ హత్యకు గురయ్యాడు. ఈయన ప్రస్తుతం కొత్తపేటలో నివాసముంటున్నాడు. కొండారెడ్డిబురుజు వద్ద ఉన్న స్వర్ణలోక్ కాంప్లెక్స్‌లో 29వ నంబర్ బంగారు దుకాణంలో నగలు తయారు చేస్తాడు. సోమవారం సాయంత్రం 7 గంటలకు మసీదులో నమాజు ముగించుకుని వస్తుండగా గుర్తు తెలియని దుండగులు కత్తులతో దాడి చేసి పరారయ్యారు. స్థానికులు అతన్ని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. పాతబస్తీలోని గనీగల్లీలో నివాసముండేటప్పుడు ఆ ప్రాంతానికి చెందిన కొందరితో ఇబ్రార్‌కు విభేదాలు ఉన్నట్లు సమాచారం. ఒకటో పట్టణ సీఐ సిబ్బందితో అక్కడికి చేరుకుని హత్యకు గల కారణాలపై విచారిస్తున్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

హాస్పిటల్‌పై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): ఓ మహిళకు లింగనిర్ధారణ పరీక్షలు చేసి, ఆమె మరణానికి కారణమైన రక్ష హాస్పిటల్‌పై చర్యలు తీసుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. కొత్త బస్టాండ్ వద్ద ఉన్న రక్ష హాస్పిటల్‌లో నిర్ధారణ చేసిన పరీక్షల కారణంగా నందికొట్కూరులోని ఆర్ఎంపీ అబార్షన్ చేయడం వల్ల నిండు చూలాలు ప్రాణాలు కోల్పోయిందని, అయినా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. నిబంధనలు పాటించని ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

కర్నూలు(సెంట్రల్): దళితులకు ఇల్లు బాడుగకు ఇవ్వబోమని చెప్పి దూషించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మీ డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.ఆమె మాట్లాడుతూ.. పాతబస్తీలో టులెట్ బోర్డు చూసి ఇంటిని అద్దెకు మాట్లాడేందుకు వెళ్లిన మహిళను యజమాని మునీర్ అహ్మద్ కులం గురించి అడిగారన్నారు. ఆమె కులం చెప్పగా దళితులకు ఇల్లు అద్దెకు ఇవ్వబోమని చెప్పి మునీర్ అహ్మద్, అతని కూతురు దూషించారన్నారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కర్నూలు టౌన్ డీఎస్పీ మునీర్‌పై కేసు పెట్టారని, ఆయన కూతురిపై కేసుపెట్టలేదన్నారు. ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాధితురాలితో పాటు ఐక్య వేదిక సభ్యులు పాల్గొన్నారు.

దండం పెడతా.. భూ సమస్య పరిష్కరించమ్మా!

- పీజీఆర్ఎస్‌కు వెల్లువలా రెవెన్యూ సమస్యలపై వినతులు
- కళ్లరిగేలా తిరిగినా పట్టించుకోవడం లేదని బాధితుల ఆవేదన
- రెవెన్యూ సదస్సులు, గ్రామసభల్లో వినతులు ఇచ్చినా పరిష్కారం శూన్యం
- నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించిన కలెక్టర్ పి.రంజిత్‌బాషా

జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్యకు దండం పెడుతున్న ఈ వృద్ధుడి పేరు ఉరుకుందు. నందవరం మండలం మిట్టసోంపురం వాసి. ఇతనికి వివిధ సర్వే నంబర్లలో పదెకరాల పొలం ఉండేది. ఇటీవల భాగ పరిష్కారాల్లో భాగంగా ఆయన అనుమతి లేకుండా రెవెన్యూ అధికారులు నాలుగు ఎకరాల పొలాన్ని సోదరి పేరిట ఆన్‌లైన్ చేశారు. దీంతో సుమారుగా ఏడాది కాలంగా నందవరం తహసీల్దార్, కలెక్టరేట్, ఆదోని సబ్ డివిజన్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకపోయింది. ఏదైనా ఉంటే మీ అక్కతో మాట్లాడుకోవాలని చెబుతున్నారని వాపోయాడు. మరోవైపు ఉరుకుంద సమస్యను ఆర్ఓఆర్ కోర్టుకు పంపామని, ఏమైనా చెప్పుకోవాలనుకుంటే అక్కడకు వెళ్లాలని అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. ఇలా ప్రతీ సోమవారం కలెక్టరేట్, సబ్‌డివిజన్, తహసీల్దార్ కార్యాలయాల్లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భూ సమస్యల పరిష్కారం కోసం అన్నదాతలు తిండీ తిప్పలు మాని, పనులు వదుకొని వస్తున్నా పరిష్కారం దొరకని పరిస్థితి.



తన సమస్యను పరిష్కరించాలని జేసీ డాక్టర్ బి.నవ్యకు దండం పెడుతున్న వృద్ధుడు ఉరుకుందు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లాలో ప్రతి సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు భారీ స్థాయిలో ప్రజలు వస్తుంటారు. జిల్లా నలుమూలల నుంచి ఎంతో వ్యయ ప్రయాసాలకోర్చి కలెక్టరేట్‌ను ఆశ్రయిస్తున్నారు. ఎంత కష్టమైనా సమస్యకు పరిష్కారం లభిస్తే చాలన్న రీతిలో వృద్ధుల నుంచి యువకుల వరకు తరలివస్తున్నారు. వచ్చే వారిలో ఎక్కువగా 50 ఏళ్లకు పైగా ఉన్న వారే ఉంటారు. వీరిలో చాలా మందికి బీపీ, షుగర్‌తోపాటు ఒళ్లు, కాళ్ల నొప్పులు ఉన్నా ఎన్నో ఆశలతో కలెక్టరేట్‌కు వచ్చి అర్జీలు ఇస్తారు. అయితే వాటి పరిష్కారాలపై క్షేత్రస్థాయిలో వేరుగా.. అధికారిక లెక్కల్లో మరో రకంగా ఉంటోంది. కాగా, వచ్చే సమస్యల్లో ఎక్కువగా రెవెన్యూ , సర్వే డిపార్టుమెంట్‌లకు సంబంధించినవే ఉంటున్నాయి. అయితే అర్జీ ఇచ్చిన వారితో మాట్లాడితే పరిష్కారం అయినట్లు అధికారులు రికార్డుల్లో చూపుతున్నారు. ఎవరైనా ఫిర్యాదు ఇస్తే వారిని కలసి ఫొటో తీసుకొని సమస్యను విని మళ్లీ కలుస్తామని చెప్పి చాలా మంది అధికారులు పరిష్కారమైనట్లు వారి లాగిన్లలో చూపుతుండటం గమనార్హం. కొందరైతే కలెక్టర్, వారి శాఖల ఉన్నతాధికారుల భయంతో కూడా సమస్యకు ఎలాంటి పరిష్కారం చూపకపోయినా చూపినట్లు లాగిన్‌లో ఎంట్రీ చేస్తుండడంతో బాధితులు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

సీరియస్‌గా తీసుకోవాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యల పరిష్కారంపై సీరియస్‌గా ఉండాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ డాక్టర్ బి.నవ్య ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలను పరిష్కరించే సమయంలో అర్జీదారుడితో మాట్లాడితే మంచి ఫలితం ఉంటుందన్నారు. పీజీఆర్ఎస్ లాగిన్లో పరిష్కారం చేసిన అర్జీల నాణ్యతను ఆడిట్ చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, స్పెషల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ చిరంజీవి పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు వచ్చిన సమస్యల్లో కొన్ని..

- లాభాలు ఆర్జిస్తున్న టూరిజం శాఖ హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లు, ఇతర సంస్థలను ప్రైవేటీకరించేందుకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన జీఓను రద్దు చేయాలని కోరుతూ ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దాదాపుగా 50 ఏళ్ల వయస్సు వచ్చిన ఉద్యోగులు పనిచేస్తున్నారని, వారందరినీ ప్రైవేట్‌కు అప్పగిస్తే ఉద్యోగ భద్రతకు ముప్పని ఓబులేసు, శ్రీనివాసులు, ఆనంద్‌కుమార్, జయమ్మ విన్నవించారు.
- రెండు కాళ్లు, చేతులు లేకపోక మంచాన పడిన తమ కూతూరు కీర్తనకు రూ.15 వేల పెన్షన్ ఇవ్వాలని కోరుతూ కర్నూలు నగరంలోని శ్రీరామ్ నగర్‌కు చెందిన యాకమ్మ కలెక్టర్‌ను కోరారు. 100 శాతం వికలత్వం ఉన్నా రూ.6 వేల పెన్షన్ వస్తోందని వాపోయారు.
- క్రీడల కోటలో నకిలీ సర్టిఫికెట్లను జారీ చేసి వ్యాయామ ఉపాధ్యాయుల నియామకాలకు సహరిస్తున్న కర్నూలు జిల్లా అథ్లెటిక్ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మహేంద్ర ఫిర్యాదు చేశాడు. ఆయన కొందరు పీడీలతో కలసి కోటరీ ఏర్పాటు చేసుకొని ఏ మాత్రం క్రీడల అనుభవం లేకున్నా సర్టిఫికెట్లను జారీ చేసి లక్షలకు లక్షలు పొగుచేసుకుంటున్నారని, ఈ నకిలీ సర్టిఫికెట్ల దందాపై విచారణ చేయాలని కలెక్టర్‌ను కోరారు.

ఎవరి ప్రయోజనాల కోసమో మమ్మల్ని బలి చేయొద్దు

- ఏబీసీ క్వార్టర్లను ఖాళీ చేయడానికి సమయం ఇవ్వాలని కోరిన బాధితులు

ప్రస్తుతం ఏ, బీ, సీ క్యాంపు క్వార్టర్లు ఉన్న స్థలాల్లో వాటిని తీసివేసి స్టేడియాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు కట్టేందుకు తమను బలి చేయవద్దని, ఎవరి ప్రయోజనాల కోసమో తమను ఇబ్బందులకు గురి చేయవద్దని కోరుతూ ఆయా క్వార్టర్లలో నివాసం ఉంటున్న కొందరు కలెక్టర్ పి.రంజిత్‌బాషాను కలసి వినతిపత్రం ఇచ్చారు. క్వార్టర్లను ఖాళీ చేయడానికి కొంత సమయం కావాలని, అప్పటి వరకు ఖాళీ చేయించేందుకు ప్రయత్నాలు చేయవద్దని కోరారు.

గురుకులం విద్యార్థులకు కలెక్టర్ అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): నీట్ పరీక్షలో ప్రతిభ కనబరచి ఎంబీబీఎస్ సీట్లు సాధించిన చిన్నటేకూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల విద్యార్థులను కలెక్టర్ పి.రంజిత్‌కుమార్ అభినందించారు. మెడికల్ సీట్లు సాధించిన నరేంద్రసాయి, గణేష్, వికాస్‌కుమార్, ప్రణయ్‌బాబు, సంతోష్‌కుమార్, సాయికృష్ణ, నితీష్ నాయక్‌లను సోమవారం రాత్రి కాన్ఫరెన్స్ హాలులో శాలువా కప్పి సత్కరించి అవార్డును అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. భవిష్యత్‌లో వైద్యులుగా రాణించి పేదలకు సేవ చేయాలని సూచించారు. ఈ యేడాది గురుకులం నుంచి 25 మంది విద్యార్థులు ఐఐటీ, 8 మంది నీట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించినట్లు డీసీఓ శ్రీదేవి కలెక్టర్‌కు వివరించారు.

నేత్రదానంపై విస్తృత ప్రచారం

కర్నూలు(హాస్పిటల్): నేత్రదాన 40వ వారోత్సవాలను పురస్కరించుకుని విస్తృతంగా ప్రచారం చేస్తున్నట్లు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి చెప్పారు. స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు, మీడియా ప్రతినిధులను భాగస్వామ్యం చేసుకుని గ్రామ గ్రామాన విస్తృత ప్రచారం చేసేందుకు రెడ్‌క్రాస్ సభ్యులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మరణించిన ఇ.సులోచన (50), కె.వీరేష్ (38)ల కార్నియాను వారి కుటుంబసభ్యుల సహకారంతో టెక్నీషియన్ ప్రదీప్ సేకరించారన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు జి.శ్రీనివాసులు యాదవ్, ప్రకాష్, సంజీవయ్య, తిరుమల పాల్గొన్నారు.

కొళాయి కనెక్షన్ ఇవ్వాలి

కర్నూలు (టౌన్): ఇందిరాగాంధీ నగర్‌లో ఉన్న తమ ఇళ్లకు కోళాయి కనెక్షన్లు ఇవ్వాలని స్థానికులు రేఖ, కళ్యాణ్, నాగరాజు విన్నవించారు. సోమ వారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ పి.విశ్వనాథ్ పాల్గొని నగర వాసుల నుంచి అర్జీలను స్వీకరించారు. కాలనీ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదనపు కమిషర్ ఆర్‌జీవీ క్రిష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ప్రజారోగ్య శాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు వచ్చిన అర్జీల్లో కొన్ని..

- డ్రైనేజీ కాల్వలు, రహదారులు నిర్మించాలని ఎఫ్‌సీఐ కాలనీ, శ్రీశైల దేవస్థాన ఉద్యోగుల కాలనీ వాసులు అశోక్ గౌడ్, రాజేష్, మల్లికార్జున అభ్యర్థించారు.
- తాగునీటి పైపులైన్ లీక్ అయ్యిందని, మరమ్మతులు చేపట్టాలని స్టాంటన్‌పురం, వాసవీనగర్‌కు చెందిన సుధాకర్ రెడ్డి విన్నవించారు.
- సీసీ రహదారులు నిర్మించాలని శ్రీనివాస నగర్‌కు చెందిన జలాలుద్దీన్, రాములు వినతి పత్రం ఇచ్చారు.



కమిషనర్ పి.విశ్వనాథ్‌కు సమస్యలు వివరిస్తున్న నగర వాసులు

మాతృమరణాల నివారణకు చర్యలు

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో మాతృమరణాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ చెప్పారు. ఆమె సోమవారం తన ఛాంబర్‌లో మాతృ మరణాలపై సమీక్ష నిర్వహించారు. లద్దగిరి పీహెచ్‌సీ, కర్నూలు నగరంలోని గడ్డస్ట్రీట్ పరిధిలో జులై, ఆగస్టు నెలల్లో సంభవించిన మాతృమరణాలపై సమీక్షించారు. క్షేత్రస్థాయిలోని సిబ్బంది ఆశా, ఆరోగ్య కార్యకర్తలు, వైద్యాధికారులు గర్భిణులను వీలైనంత త్వరగా గుర్తించి వారికి సరైన సమయంలో వైద్యసేవలు అందిస్తే తల్లుల మరణాల శాతం తగ్గించవచ్చని కమిటీ నిర్ధారించింది. హైరిస్క్ గర్భిణులకు సమయానుసారం వైద్యసేవలందించాలని, కాన్పు తేదీకి మూడు రోజులు ముందుగానే ప్రభుత్వ ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యేలా చూడాలన్నారు. డిస్ట్రిక్ట్ నోడల్ అధికారి డాక్టర్ నాగప్రసాద్‌బాబు,డీసీహెచ్ఎస్ డాక్టర్ జఫ్రుల్లా, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ

ఉద్యోగాల పేరుతో మోసం

కర్నూలు: కర్నూలు తహసీల్దార్ ఆఫీస్‌లో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ఓర్వకల్లుకు చెందిన సుంకన్న రూ.2 లక్షలు తీసుకుని మోసం చేశాడని కర్నూలు గీతా నగర్‌కు చెందిన అరుణ, బెళగల్ మండల కేంద్రంలోని బాలికల హైస్కూల్‌లో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి జొన్నగిరికి చెందిన రాజు రూ.2.50 లక్షలు తీసుకుని మోసం చేశాడని గూడూరుకు చెందిన ప్రభాకర్ ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు ఫిర్యాదు చేశారు. రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పక్కనున్న క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఎస్పీ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించి, నేరుగా వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మొత్తం 90 ఫిర్యాదులు వచ్చాయి. వాటిపై విచారణ జరిపి త్వరితగతిన న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్ పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...


- తాను పెయింటింగ్ పనిచేస్తున్నాను. కాస్ ఫౌండేషన్ పేరుతో కొంగనపాడు గ్రామంలో అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి కర్నూలులో ఒక వ్యక్తి రూ.4 లక్షలు తీసుకుని మోసం చేశాడని కల్లూరు మండలం ఉలిందకొండకు చెందిన అశోక్ ఫిర్యాదు చేశాడు.
- ఆస్తులు రాయించుకుని కుమారుడు, చిన్న కోడలు అన్నం పెట్టకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, న్యాయం చేయాల్సిందిగా కర్నూలు బాలాజీ నగర్‌కు చెందిన బీసీ రామలింగం వేడుకున్నారు.
- కర్నూలు బళ్లారి చౌరస్తాలో ఉన్న టీవీఎస్ క్రెడిట్‌లో రూ.2 లక్షలు రుణం తీసుకున్నానని, తిరిగి 36 కంతులు చెల్లించి చివరి కంతు రూ.7,500 ఏజెంటు వంశీకృష్ణకు ఇచ్చినా కూడా జమ చేయకుండా మోసం చేశాడని కర్నూలు గనీ గల్లీకి చెందిన షబ్బీర్ ఫిర్యాదు చేశారు.
- మా నాన్నకు ఇద్దరు భార్యలు. చిన్న భార్య కుమారులైన మహేష్, రాజు, ప్రసాద్ కలిసి తన వాటా కింద వచ్చిన ఆస్తిని కూడా ఆక్రమించుకోవాలని చూస్తున్నారని, తల్లి ప్రమీలను దుర్భాషలాడి దారుణంగా కొట్టారని కృష్ణగిరి మండలం పులిచర్ల గ్రామానికి చెందిన మధు ఫిర్యాదు చేశారు.
- కర్నూలుకు చెందిన అప్సర్ బాషా చిట్టీల వ్యాపారం చేస్తూ రూ.7.93 లక్షలు కట్టించుకుని మోసం చేశాడని కర్నూలు వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన లక్ష్మీదేవి, హరికృష్ణ, పద్మావతి, వరలక్ష్మి, మహాలక్ష్మి తదితరులు ఫిర్యాదు చేశారు.




ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు సమస్యలు చెప్పకుంటున్న అర్జీదారులు

పదవీ విరమణ అధికారులకు సన్మానం

కర్నూలు(సెంట్రల్): పదవీ విరమణ పొందిన సీపీఓ హిమప్రభాకరరాజు, భూగర్భ జలవనరుల శాఖ డీడీ శ్రీనివాసరావును జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా సన్మానించారు. వారిద్దరు ఆగస్టు 30న పదవీ విమరణ చేశారు. సోమవారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో వారికి జిల్లా యంత్రాంగం తరఫున శాలువా కప్పి సన్మానం చేశారు. డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి తదితరులు ఉన్నారు.







వైద్య గణనాథుడు, కురువ పేటలో భారీ గణనాథుడు



విద్యానగర్‌లో..



బంగారు పేటలో..



మునగాలపాడులో..



కడక్‌పురలో..

ఏకదంతాయా.. బహురూపాయా!



గణనాథునిడి సేవలో కాటసాని రాంభూపాల్‌రెడ్డి తదితరులు



పరిపాలన గణేశుడి సేవలో జిల్లా కలెక్టర్ తదితరులు

కర్నూలు కల్చరల్: వినాయక నవరాత్రి మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. కర్నూలు నగరంలో ఆరవ రోజు సోమవారం వినాయకుడి ఆలయాలతో పాటు గణనాథుని మండపాల వద్ద ప్రత్యేక పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు వినాయక మండపాల వద్ద నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. మండపాల వద్ద గణపతి హోమాలు, అర్చనలు, సామూహిక కుంకుమార్చనలు, విష్ణు, లలితా సహస్ర పారాయణాలు జరిగాయి. భజనలు, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పిల్లలు, మహిళలకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. శ్రీ గణేష్ మహోత్సవ కేంద్ర సమితి ప్రతినిధులు వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించి పూజల్లో పాల్గొన్నారు. స్థానిక ఉత్సవ సమితులకు పలు సూచనలు చేశారు.

పరిపాలన గణేశుడికి కలెక్టర్ పూజలు

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన పరిపాలన గణపతిని కలెక్టర్ పి.రంజిత్‌బాషా దర్శించుకున్నారు. సోమవారం ఉదయం ఆయన గణేశుడిని దర్శించుకొని జిల్లా ప్రజలకు ఆశీస్సులు అందించాలని కోరుకున్నట్లు తెలిపారు. జిల్లా అభివృద్ధి చెందేలా దీవెనలు ఇవ్వాలని కోరుకున్నట్లు చెప్పారు. ఆయన వెంట డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, ఏఓ శివరాముడు పాల్గొన్నారు.

గణనాథునికి పూజలు చేసిన కాటసాని

కల్లూరు: కల్లూరు అర్బన్ 35వ వార్డులోని సిద్ధి బుద్ధి వరసిద్ధి వినాయకునికి వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. అందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్పొరేటర్ సాన శ్రీనివాసులు, నాయకులు మిద్దూరు శ్రీనివాసులు, జానకమ్మ, కాటసాని హెల్పింగ్ హాండ్స్ సభ్యులు తదితరులు ఉన్నారు.













నరసింహారెడ్డి నగర్‌లో.., జొహరాపురం తెలుగు వీధిలో.., ఎల్కూరు బంగ్లాస్‌లో.., ప్రకాష్ నగర్‌లో.., ఎన్నార్ పేటలో.., బుధవార పేట రాజీవ్ గృహ కల్ప సమీపంలో..

ఉల్లి క్వింటా రూ.1200 ప్రకారం కొనుగోళ్లు



ఉల్లి రైతులతో మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు(అగ్రికల్చర్): రైతులు సాగుచేసిన ఉల్లి క్వింటా రూ.1200 ప్రకారం కొనుగోలు చేస్తామని మంత్రి టీజీ భరత్ అన్నారు. సోమవారం కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో పర్యటించి ఉల్లి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం ఉల్లి క్వింటాలుకు రూ.1200 ధర నిర్ణయించిందని, ఈ మేరకు మార్క్‌ఫెడ్ ద్వారా ఉల్లిని కొనుగోలు చేస్తామన్నారు. ఉల్లి విక్రయించిన రైతులకు నేరుగా బ్యాంకు ఖాతాల్లో వారం రోజుల్లో నగదు జమ అవుతుందని చెప్పారు. మార్కెట్‌కు ఉల్లిని తెచ్చే రైతులు ఆధార్, ఈ-క్రాప్ బుకింగ్, బ్యాంకు పాసు పుస్తకం, పట్టాదారు పాసుపుస్తకం నకళ్లు వెంట తెచ్చుకోవాలని సూచించారు. మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు, జిల్లా ఉద్యాన అధికారి పి.రామాంజనేయులు, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ గద్వాల రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ గోల్కొండ హజ్మత్‌బీ తదితరులు ఉన్నారు.

పరిశీలించిన కలెక్టర్

యార్డులో ఉల్లి కొనుగోలు ప్రక్రియను జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, జాయింట్ కలెక్టర్ నవ్య సోమవారం సాయంత్రం పరిశీలించారు. అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కొనుగోలు చేసిన ఉల్లిని మార్కెటింగ్ శాఖ నిర్దేశించిన మేరకు రైతుబజార్లకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు గ్రేడింగ్ చేసుకొని ఉల్లిని తీసుకొస్తే గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. మార్కెటింగ్, ఉద్యాన శాఖ, మార్క్‌ఫెడ్ అధికారులు ఉన్నారు.

క్వింటాలుకు రూ.3 వేలు ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): ఉల్లిని క్వింటా రూ.3 వేల ప్రకారం కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఉల్లిగడ్డలను పారబోసి నిరసన వ్యక్తం చేశారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం మాట్లాడుతూ.. ఉల్లి రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా ఉల్లిని క్వింటాల్ రూ.1200 ప్రకారం కొనుగోలు చేస్తే కనీసం రైతు కూలీలకు కూడా సరిపోదన్నారు. ఉల్లిని క్వింటాల్ రూ.3 వేల ప్రకారం కొనుగోలు చేయాలన్నారు. అలాగే ప్రతి ఉల్లి లాటును కొనుగోలు చేయాలన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



ఉల్లిని పారబోసి నిరసన తెలుపుతున్న ఏపీ రైతు సంఘం నాయకులు

7న శాస్త్రీయ నృత్య పోటీలు

కర్నూలు కల్చరల్: శాంతి తెలుగు సాహితీ సమితి ఆధ్వర్యంలో నాట్యరత్న హెచ్.వెంకటస్వామి సంస్మరణ సభ సందర్భంగా ఈ నెల 7వ తేదీ సాయంత్రం 6 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో నృత్య పోటీలు నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షులు కృష్ణమూర్తి పేర్కొన్నారు. 10 - 20 ఏళ్ల యువతీ యువకులు శాస్త్రీయ నృత్యాలకు 8 నిమిషాల వ్యవధిలో సోలో డ్యాన్స్ ప్రదర్శించాలన్నారు. పోటీల్లో పాల్గొనే వారు ఈనెల 7వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా 91004 37765 నంబర్‌కు వాట్సాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

క్యాన్సర్ వార్డులో ఉద్యోగ సంఘ కార్యాలయం

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని పూర్వ క్యాన్సర్ వార్డు ఏపీ హంస ఉద్యోగుల సంఘం కర్నూలు సిటీ కార్యాలయంగా మారిపోయింది. ఇక్కడి క్యాన్సర్ వార్డును ఇటీవల స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు తరలించారు. దీంతో ఖాళీగా మారిన ఈ వార్డును ఆసుపత్రి అధికారులు ఇతర వార్డు లేదా అవసరాలకు వినియోగించాల్సి ఉంది. కానీ ఓ ఉద్యోగుల సంఘం కార్యాలయానికి కేటాయించడం విమర్శలకు తావిస్తోంది. ఐపీ భవన నిర్మాణం కోసం జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ విభాగాలను ఇతర విభాగాల్లో సర్దుబాటు చేశారు. దీనివల్ల ఆయా విభాగాల్లో రోగులు ఒక్కో పడకపై ఇద్దరేసి చికిత్స తీసుకుంటున్నారు. దీనికి తోడు డ్రగ్ స్టోర్‌కు సైతం సరైన భవనం లేక షెడ్లలో కొనసాగిస్తున్నారు. వీటిలో ఏదో ఒక దానికి పూర్వ క్యాన్సర్ వార్డు భవనాన్ని ఉపయోగించుకుంటే అందరూ హర్షించేవారు. కానీ ఓ ఉద్యోగ సంఘం కార్యాలయానికి దానిని కేటాయించడం పట్ల విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



ఏపీ హంస ఉద్యోగ సంఘం కార్యాలయంగా మారిన పూర్వ క్యాన్సర్ వార్డు

– కర్నూలు(హాస్పిటల్)